

# మనం

తూర్పు పశ్చిమ, కృష్ణ జిల్లాలు

మంగళవారం 22- 04 - 2025 | 4 పేజీలు



# 15 రోజులుగా కవరేజీకి సిబ్బందిని పంపని డి పి ఆర్ ఓ



మంత్రి నిమ్మల ఆదేశాలు దేఖాతర్



పాలకొల్లు, ఏప్రిల్ 21, మనం ప్రతినిధి:ఏపీ రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటనలు మరియు వార్తలు కవర్ చేసేందుకు గత 15 రోజులుగా జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయం నుంచి ఒక్కరు కూడా రాకపోవడంతో ప్రభుత్వం తరపున మంత్రి వార్తలు అధికారికం గా కవర్ చేయలేని దుస్థితి నెలకొంది. దీంతో మంత్రి రామానాయుడు కు సంబంధించి పర్యటనల వివరాలు గానీ, వార్తలు గాని తెలియక పోవడంతో ఒకపక్క పాత్రికేయులు, మరో పక్క ప్రజలు ఇబ్బందులని ఎదుర్కొంటున్నారు.ప్రభుత్వ సిబ్బంది రాక పోవడంతో ప్రైవేట్ న్యూస్ పేపర్స్, చానెల్స్ సిబ్బంది పైనే మంత్రి నిమ్మల ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొంది.

### మంత్రి ఆదేశాలు బేకాతర్ చేసిన డి పి ఆర్ ఓ

మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లాకు వచ్చినప్పుడల్లా అధికారంగా ప్రభుత్వం తరపున పర్యటనలుమరియు వార్తలు కవర్ చేసేందుకు సిబ్బందిని పంపాల్సిన బాధ్యత సంబంధిత జిల్లా పౌర సమాచార, సంబంధాధికారి పై ఉంది. కానీ ప్రస్తుత డి పి ఆర్ మంత్రి ఆదేశాలను కూడా లెక్కచేయకుండా బేకాతరు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.ఈయన మంత్రినే కాదు ఎవరినీ లెక్క చేయరనే ఆరోపణలు గతం నుంచి కూడా వున్నాయి. ఈయన అమరావతి స్థాయిలో చక్రం తిప్పుతారని, ఆ స్థాయిలో ఉన్నతధికారుల వద్ద మంచి పట్టుందని అందువల్లే ఎవరిని లెక్క చేయరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.పశ్చిమగోదావరి జిల్లాలో ఈ కార్యాలయంలో ఫీల్డ్ వర్క్ తెలుసున్న వారు పని చేస్తున్నప్పటికీ వారిలో కనీసం ఒక్కరిని కూడా మంత్రి నిమ్మల వార్తల కవర్ చేయడానికి పంపలేకపోవడానికి కారణం ఏమిటి అని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇలా చేయడం మంత్రి ఆదేశాలు లెక్కచేయకుండా బుట్ట దాకలా చేయడంకాదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. డెప్యూటేషన్ పై ఒకరిని తనకు కేటాయించాలని మంత్రి నిమ్మల ఇప్పటికే కోరినా ఆ ఆదేశాలని కూడా తుంగలో తొక్కడం జిల్లా అధికారి లెక్కలేని తనానికి నిదర్శనం కాదా అని అంటున్నారు. కావున ఇప్పటికైనా మంత్రి ఆదేశాలు అమలు చేయక పోతే సంబంధిత అధికారులు తగిన మూల్యం చెల్లించు కోక తప్పదని పలువురు అంటున్నారు.

## కోనసీమ రైల్వే పూర్తికి సహకారం అందిస్తానన్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

### కోనసీమ వాసుల కల సాకారం దిశగా అడుగులు

### స్వాగతిస్తున్నామన్న ఎంపీ హరీష్ బాలయోగి



అమలాపురం ఏప్రిల్ 21 మనం ప్రతినిధి కోనసీమ ప్రజల చిరకాల వాంఛ రైల్వే ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు సహకరిస్తానన్న కేంద్ర సహాయ శాఖా మంత్రి శ్రీనివాస వర్మ వాఖ్యలను స్వాగతిస్తున్నామని అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు.కోనసీమ వాసుల కల సాకారం దిశగా అడుగులు ముందుకు పడుతున్నాయని అన్నారు.నాడు తండ్రి బాలయోగి అంకురార్పణ చేసిన ఈ ప్రాజెక్టు ఆయన మరణం అనంతరం మరుగున పడిపోయిందని హరీశ్ పేర్కొన్నారు.2014 లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ కాస్త ముందుకు సాగిందని 2019 లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టును పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం పనులు వేగవంతం అయ్యాయన్నారు.అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న ప్రధాని మోడీ,ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు పూర్వ వైభవం వచ్చేలా కృషి చేటున్నారన్నారు.అలాగే అనకాపల్లిలో ఇటీవల భారీ పరిశ్రమలకు శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు.అదే విధంగా కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ కూడా పూర్తి చేస్తామన్నారు.

# టిడిపిలో చేరిన వైసిపి నాయకులు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి రామానాయుడు.

పాలకొల్లు, ఏప్రిల్ 21,మనం ప్రతినిధి పాలకొల్లు మండలం పాలకొల్లు రూరల్ గ్రామానికి చెందిన పలువురు వైసీపీకి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. పాలకొల్లులోని మంత్రి కార్యాలయంలో పార్టీలో చేరిన గ్రామ వైసిపి అధ్యక్షుడు అంబటి శేషగిరి తో పాటు మరో 30 మంది కి మంత్రి రామానాయుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులను ప్రత్యేకంగా అభినందించారు. పార్టీలో చేరి నాయకులంతా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని మోదీ కలయికతో రాష్ట్ర అభివృద్ధి,సంక్షేమ పథకాలు అమలు జరగడంతోపాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తున్న రామానాయుడు నాయకత్వాన్ని కోరుకుంటూ టిడిపిలో చేరుతున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పాలకొల్లు మండల కార్యదర్శి పాముల రజనీ కుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## ప్రతిష్టాత్మక ప్రధానమంత్రి అవార్డును అందుకున్న ప్రసన్న వెంకటేష్







విజయవాడ ఏప్రిల్ 21 మనం బ్యూరో దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రధానమంత్రి అవార్డు (2023)ను ఏ పి ఎస్ డబ్ల్యూ ఆర్ ఈ ఐ ఎస్ కార్యదర్శి వి. ప్రసన్న వెంకటేష్ సోమవారం డిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో అందుకున్నారు. సోమవారం నాడు 17వ సివిల్ సర్వీస్ డే సంధర్బంగా డిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో వికసిత్ భారత్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రధాని హాజరయ్యారు. ఈ సంధర్భంగా పరిపాలనలో ఉత్తమ పనితీరు కనబరిచిన పలువురు ఐఏయస్ అధికారులకు ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వం అందించింది. ప్రసన్న వెంకటేష్ జనవరి 2022 నుంచి జూలై 2024 వరకు ఏలూరు జిల్లాకు తొలి కలెకర్ట్ గా పనిచేసిన సమయంలో ఆయన ప్రజలకు అందించిన సేవలకు గాను ప్రభుత్వం ఈ అవార్డు అందజేసింది. ఆయన ఏలూరు జిల్లా కలెక్టర్ గా పనిచేసిన సమయంలో ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల అమలులో భాగంగా మహిళలు, బాలికల్లో రక్తహీనత నివారణకు కృషి చేశారు. సామాజిక బాధ్యత చొరవ కింద జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో 'అక్షజ' అనే కార్యక్రమంతో గర్భిణీలు, ప్రసూతి మహిళల ఆరోగ్య సంరక్షణకు పాటుపడ్డారు. ఈ విధంగా, జిల్లాలో సుపరిపాలన అందించడం ద్వారా ఈ అవార్డుకు ఎంపికైన దేశంలోని 10 జిల్లాల కలెక్టర్లలో ప్రసన్న వెంకటేష్ ఒకరు. ఈ సంధర్బంగా అవార్డు అందజేసిన కేంద్ర ప్రభుత్వానికి ప్రసన్న వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిచేందుకు ప్రజా సేవకునిగా శక్తివంచన లేకుండా తాను కృషి చేస్తానన్నారు.

# డి.ఆర్.సి. లో చర్చించిన అంశాలపై సమగ్ర నివేదిక అందచెయ్యండి

- తదుపరి సమావేశంలో ప్రతి చర్య పై నివేదిక అందచేయాలి
- ప్రతిపాదనలు పంపే క్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టిలో ఆయా అంశాలు తెలియ చేయాలి
- వేసవి దృష్ట్యా త్రాగునీరు సరఫరా విధానం ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలి
- ఇరిగేషన్ ప్రాజెక్టుల కార్యకలాపాలు మరియు నిర్వహణ పై సమగ్ర నివేదిక అంద చేయాలి





రాజమండ్రి ఏప్రిల్ 21 మనం బ్యూరోపేదరిక నిర్మూలన కోసం పి-4 ను కోఆర్డినేట్ చేయడానికి ప్రతి నియోజకవర్గం లో 5 సభ్యులను నియమిస్తున్నామని, అర్హులని గుర్తించడం లో వారి జాబితా రూపకల్పన విషయంలో ఎటువంటి అలక్ష్యం లేకుండా చూడాలని జిల్లా ఇంచార్జీ మంత్రి నిమ్మల రామా నాయుడు అధికారులను ఆదేశించడం జరిగింది.స్థానిక కలెక్టరేట్ లో సోమవారం సాయంత్రం జిల్లా సమీక్ష సమావేశం జిల్లా ఇంచార్జీ మంత్రి నిమ్మల రామా నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్ , జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి , ఆదిరెడ్డి శ్రీనివాసు, బత్తుల బలరామ కృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, జ్యోతుల నెహ్రూ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, ఎస్పీ డి నరసింహా కిషోర్, జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, మునిసిపల్ కమిషనర్ కేతన గార్గ్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామా నాయుడు మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక ను వరదల సమయంలో కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా అందించేలా, ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం, ఆమేరకు ప్రజా ప్రతినిధులు నుంచి ప్రతిపాదనలు తీసుకొని వాటిని అమలు చేయాలని స్పష్టం చేశారు.ఇరిగేషన్ ప్రాజెక్టుల కార్యకలాపాలు మరియు నిర్వహణ(%ా ఒవీ%) పై సమగ్ర నివేదిక అంద చేయాలనీ, ఆయా పనుల నిర్వహణ మార్చి వరకు నిర్వహించేలా సంబంధిత ఏజెన్సీస్ జవాబుదారీతనం కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.బంగారు కుటుంబం డేటా వివరాలు స్థానిక ప్రజాప్రతినిధులు ద్వారా నిర్ధారణ చేసుకుని, అర్హులైన వారికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరేలా చూడాలని జిల్లా ఇంచార్జీ మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు పేర్కొన్నారు.ధాన్యం సేకరణ విషయంలో రైతులకు ఇబ్బంది లేకుండా ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాకి నిర్దేశించిన 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాల్ని మరో లక్ష మెట్రిక్ టన్నుల మేరకు పెంచాలని రైతుల విజ్ఞప్తి చేస్తున్నారని, ఇప్పటికే పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వారిని కోరామన్నారు.బంగారు కుటుంబం డేటా వివరాలు స్థానిక ప్రజాప్రతినిధులు ద్వారా నిర్ధారణ చేసుకుని, అర్హులైన వారికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరేలా చూడాలని జిల్లా ఇంచార్జీ మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు పేర్కొన్నారు. 20 శాతం మంది పేదల గుర్తింపు జాబితా స్థానిక ప్రజా ప్రతినిధులు కు అందచేయాలని పేర్కొన్నారు.ఇరిగేషన్ ప్రాజెక్టు ల నిర్వహణ కు ప్రత్యేకంగా నిధులు కేటాయించి, వేసవిలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాము. ఆయా పనులు ప్రతిపాదించే క్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు ద్వారా వాటిని నిర్ధారణ చేసుకుని మాత్రమే తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.విద్యావ్యవస్థలో నారాలోకేష్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకోస్తున్నారని, పిల్లలు చదువులకి దూరం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలన్నదే మానవ వనరులు శాఖామంత్రి నారా లోకేష్ ఆలోచన అన్నారు. ఆ విధానంలో చర్యలు తీసుకోవాలన్నారు.గౌరవ శాసన సభ్యులు ప్రతిపాదించిన అంశాలకి, పనులకు సంబంధించి సమావేశంలో మినిటైజ్ చెయ్యాలని, ఆయా అంశాలపై తదుపరి జిల్లా సమీక్షా సమావేశం నాటికి యాక్షన్ టేకెన్ నివేదిక అందచేయాలని ఆదేశించారు.రబీ సీజన్ మరింత సమర్థవంతంగా ధాన్యం సేకరణ చేపట్టాలని, గతంలో ఖరీఫ్ సీజన్ లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేకరణ చేయడం జరిగిందని జిల్లా ఇంచార్జీ మంత్రి నిమ్మల రామా నాయుడు పేర్కొన్నారు. 126 రకం ధాన్యం కు మంచి ధర లభిస్తోంది, ఈ పంట 135 రోజుల్లో. కోతకు రానున్నట్లు తెలియ చేశారు.రానున్న వర్షాకాలం దృష్ట్యా ఇసుక సరఫరా ఎటువంటి ఆటంకం లేకుండా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు కలక్టర్ పి ప్రశాంతి తెలియ చేశారు.ఇసుక రిచెస్ వద్ద అనధికార లావాదేవీలు లేకుండా చూడాలని సూచించారు. ప్రతి నియోజక వర్గంలో ఒక సాండ్ స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలన్నారు. సెమీ మెక్నైజ్డ్ యంత్ర పరికరాలు ద్వారా ఇసుక త్రవ్వకాలు జరిపితే రేట్ బాగా తగ్గుతుందనీ మంత్రి స్పష్టం చేశారు. ఉచిత ఇసుక సరఫరా విధానం మరింత విజిలెన్స్ పెంచడం పై దృష్టి సారించాలని ఆదేశించారు. సెప్టెంబరు నెలాఖరు వరకు ఇసుక సరఫరా లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.జిల్లాలో ఇసుజ త్రవ్వకాలు కోసం గుర్తించిన ఏజెన్సీస్ లకే స్టాక్ పాయింట్లు నిర్వహణ బాధ్యత అప్పగించడం జరిగిందన్నారు. ప్రతి నియోజక వర్గం పరిధిలో రెండు చొప్పున స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.గోకవరం మండలం ప్రతి గ్రామంలో త్రాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి నిమ్మల రామా నాయుడు ఆదేశించారు. అందుకు సంబంధించిన సి డబ్ల్యు ఎస్ స్కీమ్, ఇట్టా పథకాలను అనుసరించి, స్థానిక ప్రజాప్రతినిధులు అభిప్రాయాలు పరస్పరం తెలుసుకుని వాటిని సరైన విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ ను 2027 వరకు పొడిగించడం జరిగిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ఆధ్వర్యంలో కేంద్రం నుంచి మరింత నిధుల్ని తీసుకుని వొచ్చే అవకాశం ఉందని మంత్రి నిమ్మల రామా నాయుడు పేర్కొనడం జరిగింది.వృథాగా ఉన్న ఇరిగేషన్ స్థలాలు ఆక్రమణ లకి గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కోరారు. ప్రాజెక్టు ల నిర్వహణ వ్యవస్థ పటిష్టం చెయ్యాలని ప్రజా ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకుని రావడం జరిగింది. నిడదవోలు.. శెట్టి పేట వద్ద రైల్వే ప్రాజెక్ట్ సంబంధించి సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని తెలియ చేశారు.చెరువులు పూడిక తీత కు సంబంధించి జీవో జారీ చేయడం జరుగుతుందని మంత్రి రామా నాయుడు తెలిపారు.గోపాలపురం నియోజక వర్గం పరిధిలో మైనర్ మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు సంబంధించి క్షేత్ర స్థాయిలో హేతుబద్ధత కలిగిన సర్వే చేపట్టడం జరుగలేదని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెలియజేశారు. ఇటువంటి ప్రతిపాదనలు సిద్ధం చేసినపుడు స్థానిక ప్రజాప్రతినిధులు అభిప్రాయం తెలుసుకోవడం జరగాలని పేర్కొన్నారు. ఓ అండ్ ఎమ్ కి, డిసిల్టేషన్ కి చెందిన పనులు చేపట్టడం జరుగుతోందని ఇన్చార్జి మంత్రి తెలిపారు. ప్రతిపాదించిన పనులకు సంబంధించి సరైన విధంగా ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. గతంలో ప్రతిపాదించిన పనులకు సంబంధించి నిధుల కేటాయింపు సహేతుకంగా లేక పోవడం తో అదనపు నిధులు విడుదల చేయాలని సిఫార్సు చెయ్యడం జరిగిందని తెలిపారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు పూర్తి చెయ్యడం కోసం తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. మన బడి మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా డి ముప్పవరం స్కూలు ను వేరొక ప్రాంతంలోకి మార్చడం జరుగుతోందని, ఇది ఇబ్బంది కరంగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ సమావేశం దృష్టికి తీసుకుని రావడం జరిగింది. జాతీయ విద్యా విధానం ప్రకారం హేతుబద్ధీకరణ ప్రక్రియను అనుసరించి స్కూలు మార్చడం జరుగుతోందని ఇది కొంత ఇబ్బంది కరంగా ఉందని ఎంపి దగ్గుబాటి పురంధేశ్వరి తెలియ చేశారు. జిల్లాలో ఒక్క స్కూలు, అంగన్వాడీ కూడా మూసి వెయ్యలేదనీ కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. మోడల్ స్కూలు వలన విద్యా వ్యవస్థ మరింత పటిష్టం అవుతుందని తెలిపారు.ఇటీవల గోదావరి నదిలో మునిగి మరణాలు సంభవించడం దురదృష్టకరమన్నారు. ఇందుకోసం క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీ పురందేశ్వరి సూచించారు. 10 వ తరగతి, ఇంటర్ విద్యార్థులు మృతి చెందడం జరిగిందని, స్కూలు, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించాలని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పాల ఉత్పత్తులు పాడై పోవడం గుర్తించామని ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ సమావేశం దృష్టికి తీసుకుని రావడం జరిగింది. వీటిపై పాలను సరఫరా చేసిన వారి నుంచి వివరణ కోరాలని ఇన్చార్జి మంత్రి ఆదేశించారు. ఆమేరకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు.

## అధ్వానంగా మారిన అన్నా క్యాంటీన్ టిఫిన్. వృద్ధుల తొట్టిలోకి విసిరేస్తున్న ప్రజలు.






గొల్లప్రోలు ఏప్రిల్ 22 మనం న్యూస్. ఏపీ రాష్ట్రవ్యాప్తంగా చంద్రబాబు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగానిర్వహిస్తున్నఅన్నాక్యాంటీన్లు లో 5 రూపాయలకి3 ఇడ్లీ,5. రూపాయలకి3 పూరి పొంగలి అలాంటి పోషకాహారాలతో కూడిన టిఫిన్ ఉదయం పూట ప్రజలకు అందవలసిన అన్నా క్యాంటీన్లో మధ్యాహ్నం రాత్రి 5 రూపాయలకే. భోజన సదుపాయం కల్పించిన కూటమి ప్రభుత్వం పిఠాపురం నియోజకవర్గం పవన్ కళ్యాణ్ అడ్డాలో2 అన్నా క్యాంటీన్లు పిఠాపురం గొల్లప్రోలులో ప్రభుత్వం ఏర్పాటుచేసిన అన్నా క్యాంటీన్లను జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ నాగేంద్రబాబు శాసనమండలి సభ్యుడు పిడుగు హరి ప్రసాదు పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసు అట్టహాసంగా ప్రారంభించిన పిఠాపురం గొల్లప్రోలు అన్నా క్యాంటీన్లులో ఆకలితో ఉండే ప్రజలు భుజించవలసిన ఇడ్లీ పూరి పొంగలి ఉప్మా లాంటి టిఫిన్ పదార్థాలు లోపాపూరితంగా ఉన్నందున పిల్లలు వృద్ధులు తినటానికి పనికి,రాకుండా తయారు చేస్తున్న టిఫిన్ సెక్షన్ కాంట్రాక్టర్ పనితీరుఅద్వానము గా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు కాంట్రాక్టర్ భాస్కర్ పై గతంలో కూడా ఎన్నో ఆరోపణలు వెలుగు చూసాయి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ ని పరిస్థితి మరీ దారుణంగా మారటంతో గొల్లప్రోలు పిఠాపురం ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారుమధ్యాహ్నంరాత్రి భోజనాల లో పాసిపోయిన కూరలు అంటే నిలవపదార్థాలు అన్నా క్యాంటీన్లకు సప్లై చేస్తున్నాడన్న ఆరోపణలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి గొల్లప్రోలు అన్న క్యాంటీన్ పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి విద్యార్థులు వృద్ధులు గర్భిణీ స్త్రీలు లోప బూరితమైన అన్నా క్యాంటీన్ లో టిఫిన్ తినడానికి పనికి రాకపోవడంతో డబ్బులు పెట్టి కొనుగోలు చేసిన టిఫిన్లనుకుప్పతొట్టిలోకి విసిరేస్తున్నా రు ఇదిగో చూడండి, ఇకనైనా అన్నా క్యాంటీన్లను పర్యవేక్షించాల్సిన అధికారులు చిత్త సుద్దితో పనిచేయాలన్నారు గొల్లప్రోలు అన్న క్యాంటీన్లో పేదలకు అందిస్తున్న టిఫిన్ మధ్యాహ్నం రాత్రి భోజనం ఉదయం టిఫిన్ నాణ్యతగా ఉండేలా కాంట్రాక్టర్ ఉదయ భాస్కర్ పై చర్యలు చేపట్టాలని అన్నా క్యాంటీన్లో టిఫిన్ కొనుగోలు చేసే ప్రజలు డిమాండ్ చేస్తున్నారు లేనిపక్షంలో సమస్య కాకినాడ జిల్లా కలెక్టర్ సాన్ మోహన్ దృష్టికి తీసుకువెళ్లటం జరుగుతుందని ప్రజలు అన్నా క్యాంటీన్ నిర్వహులు కాంట్రాక్టర్ ఉదయభాస్కర్అధికారులను హెచ్చరిస్తున్నా రు,

## అన్నా క్యాంటీన్ లో పేదలకు అన్నదానం నిర్వహించిన జ్యోతుల నవీన్.



జగ్గంపేట మార్చి 21: మనంన్యూస్. జగ్గంపేట. స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద గత మూడు సంవత్సరాలుగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ కు జగ్గంపేట గ్రామానికి చెందిన కీర్తిశేషులు మారిశెట్టి గోపాలకృష్ణ (గోపి) జ్ఞాపకార్థం వారి కుమారుడు మారిశెట్టి పృథ్వీరాజ్ (బిద్ద) ఆర్థిక సహాయంతో నిర్వహించిన ఈ అన్నా క్యాంటీన్ ను మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ముఖ్యఅతిథిగా హాజరై అన్నా క్యాంటీన్ ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చాలని తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ స్ఫూర్తితో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జగ్గంపేటలో గత మూడు సంవత్సరాలుగా దాతల సహకారంతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామని ఈరోజు కీర్తిశేషులుమారిశెట్టి గోపి జ్ఞాపకార్థం వారి కుమారుడు పృథ్వీరాజ్ ఆర్థిక సాయంతో 500 మందికి అన్నదానం నిర్వహించామని ప్రభుత్వం జగ్గంపేటలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసే వరకు దాతల సహకారంతో కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, పాండ్రంగి రాంబాబు,అడబాల వెంకటేశ్వరరావు, జాస్తి వసంత్, మారిశెట్టి గణేశ్వరరావు, మరిశెట్టి సత్యనారాయణ, మరిశెట్టి రాధ, మరిశెట్టి వినోద్, మరిశెట్టి పృథ్విరాజ్, మరిశెట్టి ప్రధ్వి, మరిశెట్టి గణేష్ ,రేఖ బుల్లిరాజు, రాయి సాయి, దేగల సత్యనారాయణ, మరిశెట్టి గంగ, నాగిరెడ్డి అనిల్, గారపటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య**





జగ్గయ్యపేట ఏప్రిల్ 21 మనం న్యూస్గర్భిణీలకు బాలింతలకు చిన్నారులకు పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని,ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ టతాతయ్యఊ అన్నారు.సోమవారం జగ్గయ్యపేట పట్టణంలోని స్థానిక ఉక్కు కళా వేదిక నందు ఐ.సి.డి.యస్ ప్రాజెక్టు చిల్లకల్లు వారు పౌష్టికాహార పక్షోత్సవం సీమంతాల వేడుక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ టతాతయ్యఊ హాజరయ్యి గర్భిణీ స్త్రీలకు,బాలింతలకు,తల్లులకు పౌష్టికాహారాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ గర్భిణులు,బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.చిరుధాన్యాలలో అధిక పోషక విలువగల పదార్థాలు ఉంటాయని,గర్భిణీలు బాలింతలు ఈ ఆహారాన్ని తీసుకోవాలని,గర్భవతులు బాలింతలు సరైన సమయాల్లో పౌష్టిక ఆహారం తీసుకోని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు.గర్భిణీ స్త్రీ బాలింతలకు రక్తహీనత,చిరుధాన్యాల పై అవగాహన కల్పించారు.రక్తహీనత రాకుండా ఆకుకూరలు పప్పు దినుసుల గురించి వివరించారు.అంగన్వాడి సెంటర్లో ఇచ్చే పౌష్టికాహారం లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు,వైస్ ఛైర్మన్ పఠాన్ హాఫిజున్నిసా, తెలుగుదేశం పార్టీ పట్టణప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ,వార్డు కౌన్సిలర్ సంగేంపు బుజ్జిబాబు,టీడీపీ నాయకులు గింజుపల్లికృష్ణ,అంగన్వాడిసిడిపిఓలక్ష్మీ భార్గవి , ఏసి డిపిఓ నాగమణి,అంగన్వాడి సూపర్వైజర్లు,రజినిజ్వాల,శారద,అంగన్వాడీటీచర్లు,హెల్పర్లు,మరియు ,గర్భవతులు,బాలింతలు,తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## శారీరిక ఆరోగ్యం కాపాడుకోవడానికి వ్యాయామం తప్పనిసరి

**సిడిపిఓ సిహెచ్ ఇందిర.**



పోడూరు ఏప్రియల్ 21 మనం న్యూస్ : శారీరిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రోజు వారి వ్యాయామం తప్పనిసరి అని పాలకొల్లు ప్రాజెక్టు సిడిపిఓ సిహెచ్ ఇందిరా తెలియజేశారు.పాలకొల్లు ప్రాజెక్టు, పోడూరు సెక్టార్, పరిధిలోని పోడూరు గ్రామంలో అంగనవాడి కేంద్రాల్లో సిడిపిఓ సిహెచ్ ఇందిరా ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు, బాలింతలకు,తల్లులకు, కిశోర బాలికలకు వారు తీసుకోవలసిన ఆహారముపై, అలాగే ఆరోగ్య సంబంధిత విషయాలపై సిడిపిఓ సిడిపిఓ సిహెచ్ ఇందిరా పలు విషయాలను తెలియజేశారు, ముఖ్యంగా బాలికల కోసం ఆరోగ్యకరమైన జీవనశైలి, ప్రోత్సహించాలని 1000 రోజుల సంరక్షణ బాల సంజీవని కిట్టు యొక్క ఉపయోగాలను ఆమె క్షుణ్ణంగా వివరించారు. బాలామృతం తీసుకోవడం వలన కలిగే అద్భుతమైన ప్రయోజనాలను సిడిపిఓ సిహెచ్ ఇందిరా తెలియజేశారు. అంతేకాకుండా ఏడు నెలల శిశువు నుండి నుండి రెండు సంవత్సరాలు పూర్తయ్యే వరకు కచ్చితంగా బాలామృతం పెట్టాలని తల్లులకు సూచించారు, బిడ్డ పుట్టిన వెంటనే ఒక గంటలోపు ముర్రుపాలు పట్టాలని, ఆరు నెలలు కాలం పాటు మాత్రమే తల్లులు బిడ్డకు పాలు నివ్వాలని, తదనంతరం ఏడవ నెల నుండి అనుబంధ పోషకాహారం మొదలు పెట్టాలని కావాలంటే పుట్టిన బిడ్డకుపాలు పుష్కలంగా ఉన్న తల్లులు రెండు సంవత్సరాల వరకు పాలును ఇవ్వొచ్చని తెలియజేశారు. అలాగే ఈ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసిన సెక్టార్ సూపర్వైజర్ కె మోహనరాణిని అభినందిస్తున్నానని సిహెచ్ ఇందిరా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు,పోడూరు సర్పంచ్ సిహెచ్ సువర్ణ రాజు, మాజీ సర్పంచ్ రుద్రరాజు సుజాత రమేష్ రాజు, కూటమి నాయకులు, గర్భవతులు, బాలింతలు, తల్లులు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# చెందుర్తిలో యదేచ్చగా గ్రావిల్ దోపిడీ. పట్టించుకోని రెవెన్యూమైనింగ్ పోలీస్ అధికారులు,






గొల్లప్రోలు ఏప్రిల్ 21 మనం న్యూస్ గొల్లప్రోలు మండలం చందుర్తిఅడ్డాలో రాజకీయ నాయకుడు అండదండలతో మట్టి మాఫియా స్వామిఅండ్ కో ట్రేడ్రెగిపోతూ కొండలు గుట్టలు చెరువులు గట్టులు పోలవరంపుష్కరకాలువగట్టుపైగ్రావిల్ నిలవలను సైతం వదలకుండా ప్రభుత్వ సంపదనుఅడ్డగోలుగాకొల్లగొడుతుంటే. నిరోధించాల్సిన మైనింగ్ రెవెన్యూ పోలీస్ అధికారులు నిద్ర అవస్థలో తేలుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి ఇటీవల గొల్లప్రోలు మండలం చెందుర్తిలో మట్టి మాఫియా వేల క్యూబిక్కుల ఎర్ర కంకర నిలవలను ఏ టువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా జెసిబిలు ట్రక్కులు ట్రాక్టర్లతో చుట్టుపక్కల గ్రామాల లేఅవుట్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అరుదుగా దొరికే ఎర్ర కంకరకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున గొల్లప్రోలు మండలం చందుర్తిలో స్వామి అండ్ కో మాఫియా దారుడు9 నెలలుగా విలువైన ప్రభుత్వ సంపదను కొల్లగొడుతుంటే జనసేన పార్టీ నాయకుడిగా అవతారం ఎత్తిన రేషన్ డీలర్ పేదల ఇంటి పునాదులకు అంటూ అధికారులను రాజకీయ పెద్దలను తప్పుదారి పట్టిస్తూ చందుర్తి పరిసరాలలో కొండలు గుట్టలు చెరువులు పుట్టలు సుమారు తొమ్మిది నెలల నుండి ప్రైవేట్ లేఔట్లకు రైస్ మిల్లు లో ఖాళీ స్థలాలకుధనవంతులు ఇంటి ఆవరణలోకి రేయింబ వాళ్ళు దోపిడీ చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి పెద్ద మొత్తంలో గండి కొడుతున్నారన్న ఆరోపణలు చందుర్తి ప్రజల నుండి వినిపిస్తున్న మాట చెప్పుకుంటూ పోతే గొల్లప్రోలు మండలం తెలుగుదేశం పార్టీ నెట్టేస్తే జనసేన పార్టీ నాయకులుగా చలామణి అవుతున్న కొంతమంది మాఫియా తో చేతులు కలిపి జెసిబి లు ట్రాక్టర్లు ట్రక్కులు ద్వారా ఎర్ర కంకర ను స్వామి అండ్ కో తరలించ?కుపోతూ ఉంటే ఈ వలస నాయకులు పిఠాపురం జనసేన పార్టీ రాజకీయ పెద్దలకు అరచేతులు స్వర్గం చూపిస్తూమట్టి మాఫియా కలిసి ఎక్కడ ఖాళీ స్థలాలు ఉంటే అక్కడికి గద్ద లు లాగా వాలిపోయి హైవే ఆనుకుని ఉన్న పంట భూములను రాత్రికి రాత్రి గ్రావెల్ తో పూడ్చేసి కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారని చందుర్తి ప్రజలు బహిరంగంగా పేర్కొంటున్నారుఅక్రమంగా నిర్వహిస్తున్న గ్రావెల్ తవ్వకాలనుసమీప్తిగా నిరోధించాల్సిన మైనింగ్ రెవెన్యూ పోలీస్ అధికారులకు కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు దీనిపైకాకినాడ జిల్లా ఉన్నతాధికారులు దృష్టి నిలిపి చందుర్తిలో అక్రమగ్రావిల్ దోపిడీపైచర్యలుచేపట్టాలని ప్రజలుడిమాండ్ చేస్తున్నా రు...

## కూటమి ప్రభుత్వం విద్య వ్యవస్థను నిర్వీర్యం చెయ్యాలని చూస్తోంది

**జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్–ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు**




జగ్గయ్యపేట ఏప్రియల్ 21 మనం న్యూస్గత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తే నేటి ప్రభుత్వం అసూయతో విద్యా వ్యవస్థలో జగన్ మార్క్ ను తొలగించి లోకేష్ మార్కు కోసం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయాలని చూస్తోందని జగ్గయ్యపేట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆరోపించారు.జగ్గయ్యపేట పట్టణం స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు సోమవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ. గతంలో జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల పిల్లల భవిష్యత్తు మార్చాలంటే విద్య తోనే సాధ్యమని విద్యకి గొప్ప ప్రాధాన్యత తీసుకువచ్చారు. అమ్మ ఒడి, ఉచిత స్కూల్ బ్యాగ్ కిట్, ల్యాప్టాప్స్, నాడు నేడు స్కూల్స్ రూపురేఖలు మార్చి ఇంగ్లీష్ బై జ్యూ కంటెంట్ తో విద్యను అందించే విధంగా దేశం మొత్తం మన వైపు చూసే విధంగా మార్పు తీసుకువచ్చిన ఘనత జగన్ మోహన రెడ్డి దే అన్నారు.అది అలాఉండగా గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన విద్యావ్యవస్థలో విఫలవాత్మక మార్పులను చూసి అసూయతో కూటమి ప్రభుత్వం ఈరోజు విద్యా వ్యవస్థలో జగన్ మార్క్ తొలగించి లోకేష్ మార్క్ కోసం ఏదేదో మార్పులు తీసుకొచ్చి యూపీ స్కూల్స్ కుదించి ప్రాథమిక స్కూల్స్ లో విలీనం చేయటం బాధాకరమని అన్నారు. యూపీ స్కూల్స్ ని హై స్కూల్స్ లో మార్చాలి తప్ప ఉన్నదాన్ని తగ్గించాల ని చూడటం ఈ కూటమి ప్రభుత్వం దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు.నియోజకవర్గంలోని జగ్గయ్యపేట మండలంలో ఏడు స్కూల్స్, వత్సవాయి మండలంలో ఐదు స్కూల్స్, పెనుగంచిప్రోలు మండలంలోని ఐదు స్కూల్స్ నియోజకవర్గం మొత్తం మీద 17 స్కూల్స్ ని యూపీ స్కూల్స్ ని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారు దయచేసి ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సిందిగా అధికారులను కోరుతున్నట్లు తెలియజేశారు. యూపీ స్కూల్స్ ఏ ఊరు లో ఉంటే ఆ ఊర్లో పిల్లలు ఆ ఊర్లో దగ్గరుండి చదువుకోవడానికి మరియు దూరం వెళ్లాల్సిన అవసరం ఉండదు. అలాగే బాలికల బయటకు దూరంగా పంపించాలని తల్లిదండ్రుల్లో భయానా ఆందోళన ఉండదు, స్కూల్స్ కు పంపించడానికి తల్లిదండ్రులైన పిల్లలు అయినా ఆసక్తి చూపుతారు అన్నారు.ఉన్న స్కూల్స్ ని డెవలప్మెంట్ చేసుకుంటూ పై స్థాయికి వెళ్ళాలి తప్ప స్కూల్స్ ని కుదించటం అక్కడ ఉన్న టీచర్ను తగ్గించడం చాలా బాధాకరమని అన్నారు.బిఒకపక్క స్కూల్స్ ని తగ్గిస్తారు, మరో పక్కన ప్రభుత్వ స్కూల్స్ లో ఉన్న స్టాఫ్ ని తగ్గిస్తారు. ఇది ఎక్కడ నిర్ణయం అర్థం కావట్లేదు స్కూల్ చైర్మన్గా ఉన్న వాళ్ళ నిర్ణయాలు తీసుకోరు, గ్రామ నాయకుల నిర్ణయాలు తీసుకోరు, మీ ఇష్టం వచ్చినట్టు నిర్ణయాలు తీసుకొని ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.బినారా లోకేష్ విద్యా వ్యవస్థలో ఏదో మార్పు తేవాలని అనుకున్నారు తప్ప ఉన్న స్కూల్స్ ని తగ్గిస్తూ ఇంతవరకు పది నెలలు గడుస్తున్నా గాని తల్లికి వందనం లేదు, స్కూల్సో మెరుగైన సౌకర్యాలు అందట్లేదు అని ఎద్దేవా చేశారు.బిఏదైతే యూపీ స్కూల్స్ ని ప్రాథమిక స్కూల్స్ గా మారుస్తున్నారు అన్నా నిర్ణయం అధికారులు వెంటనే వెనక్కి తీసుకోవాలి లేని పక్షంలో తల్లిదండ్రులను ప్రజలను కలుపుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున నిరసన తెలియజేస్తామని తన్నీరు నాగేశ్వరరావు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు వట్టెం మనోహర్, జగ్గయ్యపేట మండలం పార్టీ అధ్యక్షులు బూడిద నరసింహారావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పఠాన్ హాఫిజున్నిసా - ఫిరోజ్ ఖాన్, న్యాయవాది పసుపులేటి సత్య శ్రీనివాసరావు, పట్టణ యూత్ అధ్యక్షుడు రామిని ఉపేంద్ర రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నరసింహారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మన్నే అప్పారావు, తిరుమలగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్ దర్శి వెంకటేశ్వర్లు, పట్టణ వాలంటీర్ విభాగ అధ్యక్షులు ఇమ్రాన్ పాషా, పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ సయ్యద్ బుజ్జి ఆలీ, పట్టణ ప్రధాన యువజన ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ళ సురేష్, మున్సిపల్ ఇవాళ అధ్యక్షులు అన్నెపాక మురళి, షేక్ ఖాదర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపరిష్కారానికే అధిక ప్రాధాన్యత





ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) .ప్రజల సమస్యల పరిష్కరించడమే తన ప్రధాన కర్తవని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తామని జగ్గయ్యపేట శాసనసభ్యులుశ్రీరాం రాజగోపాల్ అన్నారు. జగ్గయ్యపేట శాసనసభ్యులు గౌరవనీయులుశ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సోమవారం పట్టణంలోని 7,8వ వార్డులను సందర్శించారు. ఈ సందర్భంగా వార్డులో నివసిస్తున్న స్థానిక ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకునిపరిశీలించారు.పౌరులకు మౌలిక వసతుల కల్పన, మెరుగైన జీవన ప్రమాణాల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఆయన సమీక్ష నిర్వహించారు. స్థానికులు ముఖ్యంగా ఈ కింది సమస్యలను ఎమ్మెల్యే రాజగోపాల్ దృష్టికి తీసుకొని వచ్చారు.

- **మురుగు నీటి డ్రైనేజ్ వ్యవస్థ బాగా దెబ్బతిన్నదని, వర్షాకాలంలో నీటి నిల్వలు ఇళ్లలోకి వస్తున్నాయని**
- **రహదారి పరిస్థితి అధ్వాన్నంగా మారిందని, గుంతలతో ప్రజలకు రాకపోకలు అసౌకర్యంగా మారాయని**
- **మంచినీటి సరఫరాలో సమస్యలు ఉండడం వల్ల తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని**
- **వీధి విద్యుత్ దీపాలు పలు చోట్ల పని చేయకపోవడంతో రాత్రి సమయంలో భద్రతకు భంగం ఏర్పడుతోందని తెలిపారు.**

ఈ సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే రాజగోపాల్, వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగాఅధికారులకు ఫోన్ చేసి దేశాలుఇచ్చారు. మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ**

ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రథమ కర్తవ్యం. ప్రతి ఒక్కరి అవసరాన్ని మనస్ఫూర్తిగా తీసుకుంటాం. ప్రభుత్వ పథకాలు అందరికీ చేరాలన్నదే తన లక్ష్యం. అనిమీ సమస్యలు నన్ను నేరుగా తెలియజేయండివాటికి తక్షణమే పరిష్కారం చూపించేందుకు నా పూర్తి కృషి ఉంటుంది" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రంగపురం రాఘవేంద్ర, తొర్రగుంటపాలెం 8వ వార్డులో వార్డ్ ఇంచార్జ్ చిలుకూరి కార్తీక్ , బోసు యాదవ్ ,చిలుకూరు వెంకటేశ్వర్లు, డేవిడ్, పబ్బతి నాని, మునుగంటి వెంకటేశ్వర్లు, సైదానాయుడు, బాణాల శ్రీనివాసరావు, తోట సతీష్, పూజల కొండ, సుంకరాచారి, రావెల్ల రమేష్, వెంకటాచారి, నంచర్ల పూర్ణచంద్రరావు, గోవింద్ మరియు ఇతర మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లెప్రసీ వ్యాధిగ్రస్తులు మందులు సక్రమంగా వాడేలా చూడాలి.

**డాక్టర్ ప్రియదర్శిని.**



పాలకొల్లు, ఏప్రిల్ 21,మనం ప్రతినిధి లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ లెప్రసీ కన్సల్టెంట్ డాక్టర్ ప్రియదర్శిని. సందర్శించి డాక్టర్ అద్దాల ప్రతాప్ కుమార్ గారిని లెప్రసి కేసుల వివరాలను అడిగి తెలుసుకుని.రికార్డులను పరిశీలించారు. అలాగే కొత్త కేసులను గుర్తించి వారు మందులు సక్రమంగా వాడేటట్లు చూడాలని సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఎంవో ఎంపీ రమేష్. డిపిఎంవోలు జక్కంపూడి రాంప్రసాద్. జి వి ఎస్ ఎన్ మూర్తి. ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు. పీహెచ్ఎన్ పి ఎలిజిబెత్. ఫార్మసి అధికారి పివి స్వామి. స్టాఫ్ నర్స్ లు ముత్యవల్లి. సౌజన్య. ఎల్ టి ప్రసాద్. హెల్త్ అసిస్టెంట్ టి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పితానివారిపాలెం పాఠశాల నిర్మాణానికి నిధులు సమకూర్చిన అధికారులకు ధన్యవాదములు






**– కామనగరువు సర్పంచ్ నక్కా అరుణకుమారి**

అమలాపురం ఏప్రిల్ 21 మనం ప్రతినిధి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల పితాని వారిపాలెంలో పాఠశాల అదనపు తరగతి నిర్మాణం అసంపూర్తిగా ఉన్న భవనానికి నిధులు మంజూరు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాష దృష్టికి తీసుకు వెళ్లిన వెంటనే సానుకూలంగా స్పందించి అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణానికి లక్షా యాభై వేల రూపాయలను మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు కామనగరువు సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్. సుమారు రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించిన నూతన భవన నిర్మాణం నిధులులేక లెంటిల్ దశ వరకు వచ్చి ఆగిపోయింది.పాత భవనం శిథిలావస్థలో ఉండి పెచ్చులూడుతూ వర్షపు నీరు కారే పరిస్థితుల్లో ఉన్న భవనంలో తరగతులు నిర్వహిస్తుండడం చూసి విద్యార్థుల ఉపాధ్యాయుల అవస్థలకు చలించి డీఈఓ షేక్ సలీం భాషను విద్యార్థుల అవస్థలను పరిశీలించాలని అరుణ కుమారి కోరారు. పితానివారి పాలెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి పాఠశాల స్థితిగతులను స్వయంగా పరిశీలించి సమస్యపై వెంటనే స్పందించి తక్షణమే అక్కడికక్కడే లక్షా యాభై వేల రూపాయలను మంజూరు చేస్తున్నట్లుగా ప్రకటించి వార్షికోత్సవ వేదిక మీదే గ్రామస్తుల సమక్షంలో సాంక్షన్ ఆర్డర్స్ ని అందించారు. సమస్యపై తక్షణమే స్పందించి పరిష్కరించిన డీఈఓ భాషకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.గ్రామస్తులు తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు అరుణ కుమారి. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి పనులను పూర్తి చేసి అందించాలని లక్ష్యంతో పనులను ప్రారంభిస్తామని తెలియజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ అరుణ కుమారిని డిఈఓ సలీం భాష దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థులతో విజ్ఞానం వికాసం అందించే సృజనాత్మక కళాత్మక నైపుణ్యాలతో ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ద్వారా విద్యార్థుల ప్రతిభా పాటవాలు వెల్లి విరిసాయని, విద్యార్థులను తీర్చిదిద్దుతూ పాఠశాలలో ఉత్తమ బోధన అందిస్తున్న ఉపాధ్యాయులు సత్యప్రియ రోజారాణిలకు అభినందనలు తెలియజేశారు.

# ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం



**కార్యక్రమంలో ముఖ్య పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యనందరావు.**



రావులపాలెం ఏప్రిల్ 21 మనం న్యూస్. మండల విద్యాశాఖ అధికారి కార్యాలయము, రావులపాలెం లో సోమవారం రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, ఆత్రేయపురం మండలాలలోని భవిత కేంద్రంలో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం స్థానిక శాసన సభ్యులు బండారు సత్యానందరావు చేతుల మీదుగా జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, రావులపాలెం నందు జరిగినది. ఈ కార్యక్రమానికి జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ ఎం.వి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌరవ శాసనసభ్యులు బండారు సత్యానందరావు చేతుల మీదుగా నాలుగు మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు మొత్తం 45 ఉపకరణాలు -సిపి చైర్స్, వీల్ చైర్స్, హియరింగ్ ఎయిడ్స్, ట్రై సైకిల్స్, బ్రెయిలీ కిట్లు, రోలేటర్స్ పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్థానిక శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఆశలు-ఆశయాలు నెరవేరే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ,సమాజం వెన్నుతట్టి ప్రోత్సహించాలని వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని అన్నారు. వారు కూడా అందరిలాగే మంచి జీవితాన్ని జీవించటానికి కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు కుడిపూడి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి అధికారి ఈ. ఉమామహేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి బి. శ్రీనివాసరాజు, గుత్తుల పట్టాభి, జక్కంపూడి వెంకటస్వామి, ఏఎల్ఎస్సి కో-ఆర్డినేటర్ డి. రమేష్ బాబు, నందం సత్యనారాయణ, ఐఆర్పి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



యు.కొత్తపల్లి ఏప్రిల్ 21(మనం న్యూస్) వేసవికాలం సందర్భంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆరవ రోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమం యధావిధిగా సాగుతుందని సిపిఎం పార్టీ నాయకులు తెలిపారు కీర్తిశేషులు చింతపల్లి నూక రెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు దాతల సహకారంతో సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు ఇప్పటివరకు 2300 మంది మజ్జిగ తాగినట్లు పేర్కొన్నారు మరింత మంది సహకారం ఇస్తే వేసవకాలం అయ్యేంతవరకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే నాగేశ్వరరావు, సి హెచ్ నారాయణరెడ్డి, వెంకట సుబ్బా రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్న మత్స్యకార యువతి.



యు. కొత్తపల్లి ఏప్రిల్ 21 (మనం న్యూస్) యు కొత్తపల్లి మండలం కోనపాపేట గ్రామానికి చెందిన పి. పావని సహాయ, సహకారాల కోసం ఎదురు చూస్తుంది.ఆయువతి బోన్ మారో ట్రాన్స్లేషన్ బాధతో ఆమె కొన్నాళ్ళుగా బాధపడుతుంది.. ఇటీవల కాలంలో పావనిని విశాఖపట్నంలో ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది.ఆమె ఆపరేషన్ కి భారీగా ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పడంతో ఏమీ చేయలేని నిరాశతో కుటుంబ సభ్యులు పావనిని ఇంటికి తీసుకు వచ్చేసారు.పావని ఆపరేషన్ 50 లక్షలు ఖర్చు అవుతుందని, ముంబైలో ఆపరేషన్ చేస్తారని ఎవరైనా దాతలు ఉంటే సహాయ, సహకారాలు చేస్తారని ఆమె కన్నీరు మున్నేరుగా విలపిస్తున్నారు . సహాయం చేసే దాతలు ఉంటే 9441382969 నెంబర్ను సంప్రదించవలసిందిగా కోరారు

## వైభవంగా జరిగిన చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు



హనుమాన్ జంక్షన్ : ఏప్రిల్ 21 మనం న్యూస్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ పుట్టినరోజుకు వేడుకలు బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లంక బాబు సురేంద్రమోహన్ బెనర్జీ , గుండపనేని ఉమా వరప్రసాద్, కలపాలశ్రీధర్ , లంక అజయ్, అమృతపల్లి సూర్యనారాయణ, మండాది రవీంద్ర, పిల్లా రామారావు తదితరులు పాల్గొన్నారు. కాగా హనుమాన్ జంక్షన్ సెంటర్ లో ఆదివారం రాత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు కూచిపూడి కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొమ్మారెడ్డి రాజేష్,వీరమాచినేని సత్యప్రసాద్, వేగిరెడ్డి పాపారావు ,ముచ్చర్ల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.ర

## కేఎఫ్‌సీ కొత్త విలువైన ఆఫర్‌తో ఎపిక్ రుచి, ఎపిక్ సేవింగ్స్




గాంధీనగర్ ఏప్రిల్ 21 మనం న్యూస్: కేఎఫ్‌సీ ఎపిక్ ఆఫర్‌తో మళ్లీ వచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా ఫ్యాన్స్ సరికొత్త ఎపిక్ సేవర్‌లతో కేఎఫ్‌సీ ఇష్టమైన వాటిని ఆస్వాదించవచ్చు. చక్కని ఫింగర్ లికింగ్ చికెన్ 9 పీస్‌లను రూ. 299 ధరకే పొందవచ్చు. నమ్మశక్యం కాని ధరకు ఏడు చికెన్ స్ట్రిప్స్ బోన్‌లెస్ చికెన్ స్ట్రిప్స్, రెండు క్రంచీ, జ్యూసి హాట్ అండ్ క్రిస్పీ చికెన్ పీస్‌లు లభిస్తాయి.

## ధాన్యం కొనుగోళ్లు, అమ్మకాల విషయంలో రైతాంగం సంతృప్తి

**ధాన్యం వివరాలు, రైతాంగం సమస్యలపై అన్నదాతలతో మంత్రి కందుల దుర్గేష్ ఆరా**

**రైతన్నలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ**

**చివరి బస్తా వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం**





నిడదవోలు ఏప్రిల్ 21 మనం న్యూస్ ధాన్యం కొనుగోళ్లు, అమ్మకాల విషయంలో రైతాంగం సంతృప్తిని వ్యక్తం చేసిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం ఉదయం రాజమహేంద్రవరం నుండి నిడదవోలు నియోజకవర్గం కానూరు వెళ్లే మార్గమధ్యంలో కాన్వాయ్ ఆపి స్థానిక రైతులతో స్వయంగా ధాన్యం కొనుగోళ్లు, అమ్మకాలపై మంత్రి దుర్గేష్ ఆరా తీశారు. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఏదైనా సమస్య వస్తే తమ దృష్టికి తేవాలని మంత్రి దుర్గేష్ రైతులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ, రైతుల సమయం వృథా కాకుండా వాట్సాప్ ద్వారా సేవలు అందిస్తున్నామని తెలిపారు. తమది రైతులకు మేలు చేసే ప్రభుత్వమని, చివరి బస్తా వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఏ ఒక్క రైతూ అధైర్య పడవద్దని, ఆరుగాలం శ్రమించే ప్రతి రైతన్నకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం ఇచ్చారు. స్వయంగా మంత్రి దుర్గేష్ కాన్వాయ్ ఆపి తమ దగ్గరకు వచ్చి ధాన్యం వివరాలను, రైతాంగం సమస్యలను ఆరా తీయడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు.

## ముఖ్యమంత్రి స్వర్ణోత్సవ వేడుకలను హాజరుకాకపోవడం బాధాకరం



గాంధీనగర్ ఏప్రిల్ 21 మనం న్యూస్:ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణోత్సవ వేడుకలను విజయవాడ వేదికగా నిర్వహిస్తే ఆహ్వానం అందుకున్న మంత్రులు కనీసం హజరు కాకపోవడం బాధాకరమని పీకేఎం ఫైన్ ఆర్ట్స్ అధ్యక్షుడు పసుపులేటి వెంకటరమణ ఆవేదన వ్యక్తంచేసారు. ఈ మేరకు సోమవారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో పీకేఎం ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ 16 తేది నుంచి 20 వరకు నగరంలోని జింఖాన గ్రౌండ్ వద్ద ఉన్న కందుకూరి కళ్యాణ మండపంలో లక్షల రుపాయలు ఖర్చు చేసి వేడుకలు జరిపామన్నారు. మంత్రులు ఎమ్మెల్యేల దగ్గరికి వెళ్ళి ఆహ్వాన పత్రికలు ఇచ్చిన వేడుకలకు హజరుకాకపోవడం భాదాకరమన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో పని చేస్తున్న వారు ఆయనకు ఇస్తున్న గౌరవం ఇదేనా అంటూ ప్రశ్నించారు. సొంత ఖర్చులతో చంద్రబాబుపై అభిమానంతో వేడుకలు ఏర్పాటు చేసామని సీఎం చంద్రబాబుపై వారికి అభిమానం లేదు అన్న విధంగా ఉందన్నారు.

## న్యాయవాదినైనా నాకు న్యాయం జరగలేదు

**- న్యాయవాది మణిప్రియ**



గాంధీనగర్, ఏప్రిల్ 21, మనం న్యూస్: ఒక జూనియర్ న్యాయవాదిగా ఉన్న తనకు జరిగిన అన్యాయంపై పిర్యాదు చేసినా ఇంత వరకు ఎఫ్ ఐ ఆర్ బుక్ చేయలేదని, పైగా కేసు ఉపసంహరించుకోవాలని బెదిరిస్తున్నారని సుప్రీం కోర్టు, హై కోర్ట్, ఈ విషయాన్ని సుమోటోగా తీసుకొని న్యాయం చేయాలని జూనియర్ లాయర్ మణిప్రియ కోరారు. సోమవారం గాంధీనగర్లోని ప్రెస్ క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2023 నుండి బెజవాడ బార్ అసోసియేషన్ లో మెంబర్గా కొనసాగుతున్నా అన్నారు. అంతకు ముందు తన భర్తతో ఫ్యామిలీ సమస్యలు ఉండటంతో ఆ కేసు నిమిత్తం కోర్టుకి వస్తూ ఉండేదాన్ని అన్నారు. ఆ సమయంలో లాయర్ పిట్టల శ్రీనివాస్ తనకు సూచనలు, సలహాలు ఇస్తు మంచిగా ఉండేవారన్నారు. ఆ తర్వాత తాను లాయర్ అవ్వాలని అనుకుని చదివాననీ, అనంతరం శ్రీనివాస్ కొన్నాళ్ల తర్వాత తనన్ను చాలా చిన్నచూపుతో మాట్లాడటం, వ్యంగ్యంగా మాట్లాడటం జరిగిందన్నారు.అంతేకాకుండా తన భర్తతో విడాకులు తీసుకొని తనన్ను పెళ్ళిచేసుకో అని మాట్లాడేవారన్నారు. ఈ నెల 17న నేను కోర్టుకు వెళుతున్న సమయంలో శ్రీనివాస్ ఎమ్ ఎస్ జె కోర్టు కారిడార్ లో నిలబడి వెళ్ళుతున్న సమయంలో తన భుజం పై చేయి వేసి పట్టుకు లాగారన్నారు. దీనిపై గొడవ జరుగుతున్న సమయంలో బెజవాడ బార్ అసోసియేషన్ హాల్ ప్రెసిడెంట్ ఛాంబర్లో శ్రీనివాస్, మరో లాయర్ సౌందర్య తనన్ను దుర్భాషలాడి చెంప మీద దెబ్బలు కొట్టి, తన బట్టలు చింపేశారనీ ఆరోపించారు. దాంతో తాను కోర్టు ముందు రోడ్డు పైన కూర్చొని నిరసన తెలిపానన్నారు. దీనిపై బార్ అసోసియేషన్, మహిళ పి ఎస్ లో పిర్యాదు చేశానన్నారు. అయినా ఇప్పటి వరకు ఎఫ్ ఐ ఆర్ బుక్ చేయలేదని పైగా పిర్యాదు వెనక్కు తీసుకోవాలని బెదిరిస్తున్నారన్నారు. తక్షణం శ్రీనివాస్, సౌందర్యలను సస్పెండ్ చేసి వారిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయాలని కోరుతున్నాను అని తెలిపారు.

## టివి మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య పరీక్ష శిభిరం



పాలకొల్లు, ఏప్రిల్ 21,మనం ప్రతి నిధి స్థానిక వీవర్స్ కాలనీలోని వీవర్స్ కమ్యూనిటీ హాలు నందు ఐ.యఫ్.టి.యు అనుబంధ పశ్చిమ గోదావరి జిల్లా ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య పరీక్ష శిభిరం నిర్వహించినారు. జిల్లా అధ్యక్ష,ఉపాధ్యక్షులు చెరుకూరి దుర్గా ప్రసాద్,మానెం బసవరాజు లు నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ చెరుకూరి దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వర్కర్స్ ప్రధానంగా కంటి తో అత్యధికంగా శ్రమ చేయడం వలన తరచుగా కంటిచూపు సమస్యలు ఎదుర్కొంటారనీ. అందుకే బిపి,షుగర్ లతో పాటుగా కంటి పరీక్షలు నిర్వహించే ఏర్పాటు చేశామనీ, అవసరమైన వారికి ఆపరేషన్ లు కూడా చేయిస్తామన్నారు. సెక్రటరీ నల్లా శివ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ముందు ముందు ఇంకా నిర్వహించటానికి తమయూనియన్ సంసిద్ధమన్నారు.సి ఐ.యఫ్.టి.యు జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ యస్. రామ్మోహన్ లు మాట్లాడుతూ కార్మికులు తమ ఉపాధి తోపాటు ఆరోగ్యం కాపాడుకోవడానికి కూడా నిరంతరం కృషి చేయాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం కూడా వీరి సంక్షేమానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదరణ వంటి పథకాలను, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బండి దుర్గాప్రసాద్, జమితార చంద్రశేఖర్,కట్టోజు భాస్కర్, కొల్లి బ్రహ్మాజీ ,గుబ్బల శ్రీను, బత్తుల నాగేశ్వరరావు, వట్టి శ్రీనివాస్,బండి కృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

## యువతి వివాహానికి మానవత ఆర్థిక సహాయం



పాలకొల్లు, ఏప్రిల్ 21,మనం ప్రతినిధి పేదరికంలో ఉన్న యువతి వివాహానికి ఆర్థిక సహాయం చేయగలటం ఎంతో సంతోషంగా ఉందని మానవతా కన్వీనర్ ముత్యాల రామారావు అన్నారు. పోడూరు మండలం జిన్నూరు గ్రామ శివారు భూపయ్య చెరువు ప్రాంతానికి చెందిన జ్యోతి అనే పేద యువతి వివాహానికి మానవత తరఫున సోమవారం రూ16,250 నగదు, నూతన వస్త్రాలు బహుకరించారు. ఈ సందర్భంగా మానవతా సభ్యులు, దాతలకు జిల్లా ఆత్మీయ కమిటీ డైరెక్టర్ ముత్యాల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా కోశాధికారి ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్,రోటరీ ప్రెసిడెంట్ రావాడ సతీష్, రోటరీ ట్రెజరర్ పోతాబత్తుల సత్యనారాయణ, మానవత సభ్యులు విన్నకోట వెంకటరమణ,ముత్యాల నాగకుమారి, గుడాల హరిబాబు, హెల్త్ సూపర్వైజర్ చిట్టూరి పద్మకుమారి, ఏఎన్ఎం ఏ గౌరీదేవి,హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్ ప్రాంగనంలో చలివేంద్రం ప్రారంభం




పాలకొల్లు, ఏప్రిల్ 21,మనం ప్రతినిధి :ఉభయ గోదావరి జిల్లాల గోవింద మాల కళ్యాణోత్సవ కమిటీ ఆధ్వర్యంలో పాలకొల్లు రైల్వే స్టేషన్ నందు వేసవికాలం దృష్ట్యా ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు సోమవారం చలివేంద్రం ప్రారంభించడం జరిగినది. ఈ చలివేంద్రాన్ని సౌత్ సెంట్రల్ రైల్వే డి ఆర్ యు సి సి మెంబర్ జక్కంపూడి కుమార్ రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఇంచార్జ్ రైల్వే స్టేషన్ మాస్టర్ స్నేహ గారు ప్రయాణికులకు చల్లటి మంచినీటిని అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ వేసవికాలంలో ఈ చలివేంద్రాలు ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి ఉపయోగపడతాయి కనుక అన్ని రైల్వే స్టేషన్ ల లోనూ ప్రతి సంవత్సరం వేసవి కాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయటానికి సన్నాహాలు చేస్తున్నట్లుగా చెప్పారు. ఈ కార్యక్రమంలో గోవింద మాల ఉత్సవ కమిటీ గురు స్వామి యాదంరెడ్డి సత్యం, గౌరవ అధ్యక్షులు బీరక ప్రసాద్, భారతీయ జనతా పార్టీ పాలకొల్లు పట్టణ శాఖ అధ్యక్షులు కొల్లి కొండా ప్రసాద్, టంగుటూరి నాగేశ్వరరావు, మారెళ్ళ మణి, వాకా శ్రీనివాసరావు, ఉయ్యూరి చిరంజీవి, కొప్పినీడి సురేష్, చెరుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాడ లోగ్రావెల్ టాక్టర్లు పై పోలీసుల దాడి 4.ట్రాక్టర్లను స్వాధీనం





గొల్లప్రోలు ఏప్రిల్ 21 మనం న్యూస్. గొల్లప్రోలు మండలం దుర్గాడ లో అక్రమ గ్రావెల్ తరలిస్తున్న4ట్రాక్టర్లను ఆదివారం తెల్లవారుజామున గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి 4అక్రమ గ్రావిల్ టాక్టర్లను గొల్లప్రోలు పోలీస్ స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలియపరిచారు.

## ప్రభుత్వ పాఠశాల లో చదివే పిల్లలకు నాణ్యమైన విద్య అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**బడి ఈడు పిల్లల కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే సత్యానందరావు.**





కొత్తపేట ఏప్రిల్ 21 మనం న్యూస్. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కొత్తపేట మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కూటమి ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కావునా బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎమ్మెల్యే సత్యానందరావు తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో డైరెక్టర్ బుచ్చి బాబు సందడి



యు. కొత్తపల్లి ఏప్రిల్ 21(మనం న్యూస్) ఉప్పెన మూవీ,త్వరలో రాబోతున్న రామ్ చరణ్ పెద్ది మూవీ డైరెక్టర్ సానా బుచ్చిబాబు సోమవారం సందడి చేశారు.11 నెలల క్రితం బుచ్చిబాబు తండ్రి వెంకట్రావు( పెదకాపు) మరణించారు.పెదకాపు సంవత్సరికం కార్యక్రమ నిమిత్తం. హైదరాబాదు నుంచి బుచ్చిబాబు స్వగ్రామమైన కొత్తపల్లి విచ్చేశారు.పలువురు బంధువులు, స్నేహితులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు .అనంతరం బుచ్చిబాబుతో పలువురు ఫోటోలు సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు.. కొత్తపల్లి కి చెందిన మణికంఠ క్యాటరింగ్ యాజమాని గంపల ఈశ్వరరావు,సిబ్బందితో బుచ్చిబాబు కాసేపు సందడి చేశారు.ఈ సందర్భంగా పలువురు స్నేహితులు త్వరలో రానున్న రామ్ చరణ్ పెద్ది మూవీ కోసం అడిగి తెలుసుకున్నారు..ఇటీవల విడుదలైన పెద్ది మూవీ ఫస్ట్ షార్ట్ చాలా బాగుందని పలువురు బుచ్చిబాబును అభినందించారు.గ్రామీణ ప్రాంతం నుండి ఇంటర్నేషనల్ స్థాయికి కొత్తపల్లి గ్రామాన్ని తీసుకువెళ్లినందుకు పలువురు బుచ్చిబాబుని అభినందించారు. వచ్చే ఏడాది రిలీజ్ కాబోతున్న పెద్ది సినిమా సూపర్ హిట్ అయ్యి మంచి పేరు ప్రఖ్యాతలు రావాలని గ్రామస్తులు కోరారు

## "తగ్గేదేలే " అని పదవ తరగతి విద్యార్థులను ఉత్తేజపరిచిన కామనగరువు సర్పంచ్ "నక్కా అరుణ కుమారి"



అమలాపురం ఏప్రిల్ 21 మనం ప్రతినిధి విద్యా సంవత్సరం ముగింపు దశలో తొమ్మిదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను పదవ తరగతిలోకి ఆహ్వానించి వచ్చేసంవత్సరం పదవ తరగతి ఫలితాలలో "తగ్గేదేలే" ఖచ్చితంగా విజయం సాధించి తీరాలి అని విద్యార్థులను ఉత్సాహపరిచి ఉత్తేజం కలిగించి స్ఫూర్తిని రగిలించారు కామనగరువు సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్. సోమవారం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల కామనగరువు ప్రధానోపాధ్యాయులు వి. చక్రధరరావు అధ్యక్షతన జరిగిన వివిధ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా సర్పంచ్ అరుణకుమారి హాజరయ్యారు. కామనగరువు గ్రామ కమిటీ సభ్యులు రాజులపూడి మురళీకృష్ణ ఇరవై వేల రూపాయలతో ముప్పది మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు బహుకరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతూ పాటు క్రీడలు ఎంతో అవసరమని క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని తెలియజేశారు. అమలాపురం డివిజన్ నీటి సంఘం అధ్యక్షులు రాజులపూడి వెంకటేశ్వరరావు (భీముడు) తన సందేశంలో విద్యార్థులు ఆడుకునేందుకు సౌకర్యవంతమైన క్రీడా దుస్తులు సేవాభావంతో అందించిన మురళీకృష్ణను అభినందించారు. పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ కోమటి సత్యనారాయణ పాఠశాల ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని కొనియాడారు. స్థానిక వార్డు సభ్యులు కామన సత్యనారాయణ గ్రామ పెద్దలు రాజులపూడి సత్యనారాయణ పాల్గొన్నారు. పాఠశాల అభ్యున్నతికి గ్రామ ప్రముఖులు గ్రామస్తులు సహకరించాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. తెలుగు భాష ఉపాధ్యాయులు బాలార్జున సత్యనారాయణ మాకే ఆధ్వర్యంలో జి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులను గ్రామ సర్పంచ్ నక్కా అరుణకుమారి రాజులపూడి భీముడు రాజులపూడి మురళీకృష్ణ కోమటి సత్యనారాయణ అతిధులు ఉపాధ్యాయులు తరగతి గదులలోకి కరతాళ ధ్వనులతో పండుగ వాతావరణంలో ఆహ్లాదకరంగా ఆహ్వానించి కూర్చోబెట్టి విద్యార్థులను ఆత్మీయంగా పలకరించి విద్యార్థులు ఉత్తేజపరిచారు. కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని రాబోయే పదవ తరగతిలో అత్యున్నత మార్కులు సాధనే లక్ష్యంగా ఇష్టంతో చదవాలని సందేశం అందించి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేసారు.

## పలకలు, పుస్తకాలు పంపిణి



కాట్రేనికోన ఏప్రిల్ 21 మనం న్యూస్ కాట్రేనికోన పంచాయతీ పరిధిలో ని ఎంపి యూ పి ఎస్ వేట్లపాలెం నందు జరిగిన ఎన్రోల్మెంట్ డ్రైవ్ మరియు వార్షికోత్సవమునకు ఎం ఈ ఓ 1 మరియు ఎం ఈ ఓ 2 వెంకట రమణ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు హాజరయినారు. అడ్మిషన్ డ్రైవ్లో భాగంగా 2025-26 స%శీ%" లో 1వ తరగతిలో జాయిన్ అయిన 12 మంది విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారులు,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ సంఘ నాయకుల చేతుల మీదుగా పలకలు, ప్లాంక్స్ ,బలపాలు మరియు ఎక్కముల పుస్తకములు పంపిణీ చేయుట జరిగినది ఈ సంవత్సరం లోగల 1 నుండి 8 వ తరగతి విద్యార్థులను తరువాత తరగతి లోకి ట్రాన్సిషన్ చేయించారు అనంతరం మండల విద్యాశాఖాధికారులు, మాట్లాడుతూ... 2025-26 అకాడమిక్ ఇయర్ లో ఈ పాఠశాల మోడల్ ప్రైమరీ, హైస్కూల్ గా అప్గ్రేడ్ ఐనదని, నూతనముగా ఉపాధ్యాయులు సంఖ్య కూడా పెరిగినది మరియు భవిష్యత్తులో అదనపు తరగతి గదులు కూడా వస్తాయని కాబట్టి మీ హాబిటేషన్ లో గల ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులను కూడా ఈ పాఠశాలలో జాయిన్ అయ్యేలా కృషి చేయాలనివిచ్చేసిన తల్లిదండ్రులకు తెలుపుట జరిగినది. ఈ విషయం యూపీ స్కూల్, హై స్కూల్ గా అప్గ్రేడ్ అవడం పట్ల ఎస్ ఎం సి సభ్యులు, గ్రామపెద్దలు,తల్లిదండ్రులుసంతోషము వ్యక్తపరచినారు

## కొత్తూరు చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

### పాదం ప్రసాద్, కొత్తూరు చెరువు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు.



పోలవరం ఏప్రి యల్ 21(మనం న్యూస్):పోలవరం మండలం కొత్తూరు చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, చెరువులోని మట్టి రైతులు తమ పొలంలోకి తరలించుకునేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ కొత్తూరు చెరువు నీటి వినియోగధారుల సంఘం అధ్యక్షులు పాదం వివిఎస్ఎన్ వి ప్రసాద్ సోమవారం ఏలూరు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాదం ప్రసాద్ మాట్లాడుతూ కొత్తూరు చెరువుకు సంబంధించి పలు సమస్యలు ఉన్నాయని అన్నారు. వాటి పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని అధికారులను,నాయకులను కలిసి కొత్తూరు చెరువు సమస్యలపై వినతిపత్రాలు అందజేస్తున్నామన్నారు. ఇసుక కాలువ గండ్లు పూడ్చుటకు, రెండవ నెంబరు, మూడవ నెంబరు చెరువు రెగ్యులేటర్ మరమ్మత్తులు కోసం ఇతర సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరు చేయాలని,కడమ్మ కాలువ డి.సిల్టింగ్ చేయాలని,చెరువులోని మట్టిని రైతులు వారి పొలంలోకి తరలించుకునేందుకు అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరడం జరిగింది అన్నారు. ఆయన వెంట వింజరం గోవిందరాజు చెరువు నీటి సంఘం అధ్యక్షులు పాయం వెంకట సాయి తదితరులున్నారు.

## పి జి అర్ ఎస్ నిర్వహణ అంతంత మాత్రం హాజరు



కాట్రేనికోన ఏప్రిల్ 21 మనం న్యూస్ :ప్రజా సమస్యలు పరిష్కార వేదిక స్పందన (పి జి అర్ ఎస్ ) కార్యక్రమం సోమవారం కాట్రేనికోన తహసీల్దార్ కార్యాలయం నందు నిర్వహించారు. తహసీల్దార్ పి సునీల్ కుమార్, ఎంపీడీఓ ఎస్ వెంకట చలం, ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం కు అధికారులు హాజరు తక్కువగా నమోదు అయ్యింది. ఇరిగేషన్ శాఖకు సంబందించిన సమస్య వచ్చింది ఆ శాఖ నుండి ఎవరూ రాకపోవడం తో తహసీల్దార్ ఆధ్వర్యంలో సమస్య ను ఇరిగేషన్ అధికారి దృష్టికి తీసుకుని వెళ్తామని అయన తెలిపారు. హౌసింగ్, ఎలక్ట్రికల్, వెటర్నరీ, ఐ సి డి ఎస్, అర్ డబ్లు ఎస్, వ్యవసాయం శాఖల సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులు కనిపించలేదు

## గోదావరి నిలయం వృద్ధాశ్రమంలో కొవ్వాసు మోక్షజ్ఞ నాయక్ పుట్టినరోజు వేడుకలు..

### వృద్ధులకు అన్నదానం..



పోలవరం ఏప్రిల్ 21(మనం న్యూస్) టిడిపి రాష్ట్ర ఎస్టి సెల్ ఉపాధ్యక్షులు కొవ్వాసు విజయ్ నాయక్ ,పోలవరం నియోజకవర్గం టిడిపి మహిళా నాయకురాలు కొవ్వాసు జగదీశ్వరి దంపతుల కుమారుడు మోక్షజ్ఞ నాయక్ పుట్టినరోజు వేడుకలను మండలంలోని స్థానిక గోదావరి నిలయం వృద్ధాశ్రమంలో వృద్ధుల సమక్షంలో కుటుంబ సభ్యులతో, పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆశ్రమంలోని వృద్ధుల సమక్షంలో మోక్షజ్ఞ నాయక్ బర్తడే కేక్ కట్ చేసి పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మోక్షజ్ఞ బర్డే సందర్భంగా మధ్యాహ్నం ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెల్లూరి మణికంఠ,అబ్దుల్ రజాక్, రాహుల్ దొర, రాజేంద్రప్రసాద్ దొర, తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలి గ్రామంలో పరామర్శల్లో పాల్గొన్న యువ నాయకులు బండారు సంజీవ్

### కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన యువ నేత.





ఆత్రేయపురం ఏప్రిల్ 21 మనం న్యూస్. మండలంలోని ర్యాలీ గ్రామంలో ఇటీవల మృతి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబ సభ్యులను, అదేవిధంగా అనారోగ్యాలకు గురైన ఇందుగల బుజ్జి, నామాల శ్రీను, మద్దూరి బాలత్రిపుర సుందరి కుటుంబాలను సోమవారం వారి గృహలకు వెళ్లి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను కారణాలను అడిగి తెలుసుకుని, అధైర్యపడవద్దని, పార్టీ, మన ఎమ్మెల్యే సత్యనందరావు అండగా ఉంటారని భరోసా కల్పించారు. యువనేత వెంట స్థానిక నాయకులు, యువకులు అయన వెంట ఉన్నారు.

# పి జి అర్ ఎస్ ద్వారా 266 అర్జీలు స్వీకరణ



దివ్యాంగులకు స్మార్ట్ ఫోన్ లు పంపిణీ



అమలాపురం ఏప్రిల్ 21: మనం ప్రతినిధి ప్రతి అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజి ఆర్ఎస్) దరఖాస్తుల పరిష్కారం ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారిని బిఎల్ఎన్ రాజకుమారి అధికారులను ఆదేశిం చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు నిర్వహిం చిన ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్ర మంలో డిఆర్ఓ, ఆర్డీవో కే మాధవి, డిఆర్డిఏ డ్వామా పీడీలు, సాయినాథ్ జై చంద్ర గాంధీ, ఎస్ మధుసూదన్, ఎస్ డి సి కృష్ణమూర్తి లు ఫిర్యాదు దారుల నుండి సుమా రుగా 266 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ పరిష్కార విధానం స్థితిగతులపై సంతృప్తి స్థాయిలను ముఖ్యమంత్రి కార్యా లయం నుండి ఐవిఆ ర్ఎస్ సర్వే ద్వారా స్వీకరించడం జరుగు తో%శీ%దన్నారు. ధరఖాస్తు దారుడితో మర్యాద పూర్వకంగా ప్రవర్తిస్తూ స మస్యలను సావధానంగా విని అర్థం చేసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు అధికా రులు అర్జీదారుల స మస్యలపై సానుకూ లంగా స్పందించాలన్నా రు ప్రజా సమస్యల పరిష్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్న దన్నారు. పేద ప్రజలు పిజిఆర్ఎస్లో తమ సమస్యల పరిష్కారం కోరుతూ దరఖాస్తులు సమర్పిస్తారని వాటిలో అర్హత కలిగిన ధరఖాస్తు లకు అర్జీదారునికి సంతృప్తికరమైన రీతిలో నాణ్యమైన పరిష్కారాన్ని అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆమె స్పష్టం చేశారు ముఖ్యమంత్రి కార్యా లయం, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, తదితరాల వారి వద్ద నుండి అందిన ప్రజా సమస్యల ఫిర్యాదు ల పరిష్కారంలో అధికా రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకు ని ప్రతీ దరఖాస్తును క్షు ణ్ణంగా పరిశీలించాలన్నా రు. దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా పరిష్కా రానికి చర్యలు తీసుకోవా లని, అర్హత లేని దరఖా స్తులను తిప్పి పంపుతూ అందుకు గల కారణాల ను స్పష్టంగా ధరఖాస్తుదా రునికి, సదరు ప్రజాప్రతి నిధికి తెలియజేయాల న్నారు. రెవిన్యూ చట్టా లపై తహసీల్దార్లు, రెవిన్యూ సిబ్బంది పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండి ప్రజా సంతృ ప్తే కొలమానంగా పనిచే యాలని ఆదేశించారు. ఆర్డీవో కే మాధవి ప్రసంగి స్తూ ప్రతి మండల డివిజన్ జిల్లా కేంద్రాలలో అందిన అర్జీలను వెంటనే పీజీఆర్ఎస్ వెబ్సైట్లో ఆన్లై న్ చేస్తూపరిష్కరించాలని సూచించారు ఈ వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారం చూపాలని పీజీఆర్ఎస్లో నమోదవు తున్న అర్జీలకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉంద న్నారు. అర్జీలు ఏ స్థా యిలోనూ పెండి%శీ%గ్ ఉండరాదన్నారు. అర్జీదారుల సమస్యను అధికారులు ఓపిగ్గా విని పరిష్కార మార్గాన్ని తెలపాల్సిన బాధ్యత ఉందన్నారు. సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని వారిలో కలిగించాలన్నారు. అర్హతను పరిశించాలని, అనర్హత ఉంటే తగిన కారణాలను అర్జీదారునికి వివరించాలన్నారు. పరి ష్కారమైన అర్జీదారులతో ఐవీఆర్ఎస్ ద్వారా ఉన్న తాధికారులు వారి సంతృ ప్తి స్థాయిని తెలుసుకోవ డం జరుగుతుందన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తుల ను అవసరమైతే సంబం ధిత అధికారులు క్షేత్ర స్థాయిలో స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. గడువులోగా పరిష్కరిం చాల్సిన అర్జీలపై అధికారులు దృష్టి పెట్టాలని, గడువు తీరిన అర్జీలు ఏ శాఖ లోనూ పెండి%శీ%గ్ ఉండరాదన్నా రు ఆన్లైన్ డిజిటల్ లావాదేవీలపై ప్రతి ఒక్కరూ పరిపూర్ణమైన అవగాహనను పెంపొం దించుకోవాలని ఎవరి ప్రలోభాలకు లోను కాకుండా వ్యవహరించా లని యూబీఐ ప్రతినిధి కిరణ్ వెల్లడించారు కేవైసీలు తప్పనిసరిగా బ్యాంకుకు వెళ్లి ఖాతా దారులు చేయించు కోవాలని సూచించారు డిజిటల్ అరెస్ట్ అనేది లేదని సైబర్ క్రైమ్ జరిగినప్పుడు వెంటనే సైబర్ క్రైమ్ వెబ్సైట్లో ఫిర్యాదు చేయాలని లేదా 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు తెలపాలన్నారు సోషల్ మీడియా పేరిట ఫ్రెండ్ అని చెప్పి మోసాలు జరుగుతున్నాయని అటువంటి వాటిపట్ల అప్రమత్తంగా వ్యవహ రించాలన్నారు. ఏటీఎం కార్డు వెనుక పిన్ నెంబర్ రాయకూడదని సూచిం చారు. బ్యాంకు లావా దేవీల పాస్వర్డ్ పిన్ నెంబర్లు ఎట్టి పరిస్థితుల్లో నూ ఎవరికి తెలియజేయ రాదన్నారు జిల్లా దివ్యాం గులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచా లకులు వి వి.వి లక్ష్మణరావు ఆధ్వర్యం లో డిఆర్ఓ రాజకుమారి ద్వారా ఆరుగురు చెవిటి మూగ దివ్యాంగులకు రూ 15వేలు విలువచేసే స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల నియంత్రణలో బ్యాంకు అధికారుల సహకారం కీలకం





ఎక్కువ మొత్తంలో నగదు డ్రా చేస్తున్న, ట్రాన్స్ఫర్ చేస్తున్న వివరాలను అడగాలన్న సిఐ వెంకటేశ్వర్లు

జగ్గయ్యపేట ఏప్రిల్ 21 మనం న్యూస్సైబర్ నేరాల నియంత్రణకు బ్యాంకు అధికారులు పాత్ర కీలకం అని జగ్గయ్యపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ పి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణ పోలీస్ స్టేషన్లో సైబర్ నేరాల నియంత్రణపై జగ్గయ్యపేట , జగ్గయ్యపేటపరిసర ప్రాంతాలలోని బ్యాంకు అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో డిజిపి, జిల్లా స్థాయిలో పోలీస్ కమిషనర్ సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టి బ్యాంకు ఉన్నతాధికారులతో సైతం సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు .సైబర్ నేరగాళ్లు రోజుకొక మోసంతో వినియోగదారులను మోసగించి డబ్బును దోచుకుంటున్నారని వివరించారు. జగ్గయ్యపేట నియోజకవర్గం వత్సవాయి మండలం పోలంపల్లికి చెందిన ఓ ప్రముఖ కాంట్రాక్టర్ ను శనివారం సైబర్ నేరగాళ్లు మోసగించి 15 లక్షల రూపాయల నగదును తమ ఎకౌంటు ట్రాన్స్ఫర్ చేసుకోవడమే కాక ఐదు లక్షల రూపాయల నగలను బ్యాంకులో తాకట్టు పెట్టి సైతం నగదును తమ ఎకౌంట్లోకి మార్చుకున్నారని సి ఐ వివరించారు. సైబర్ నేరాల నియంత్రణకు బ్యాంకు అధికారులతో అలానే బ్యాంకు వినియోగదారులతో అపార్ట్మెంటులోనూ అవగాహన సదస్సులను నిర్వహించిన విషయాన్ని సిఐ వెంకటేశ్వర్లు గుర్తు ఎన్ని అవగాహన సదస్సులు చేసిన సైబర్ నేరగాళ్లు తమ నేరాలను వివిధ రూపాలలో కొనసాగిస్తున్నారని ఆయన వివరించారు.బ్యాంకుల నుంచి రెండు లక్షలకు పైగా ఎవరైనా డ్రా చేస్తుంటే బ్యాంకు అధికారులు వారిని గమనించాలని ఎందుకు డ్రా చేస్తున్నారు అని ప్రశ్నించాలని అన్నారు. సైబర్ నేరగాళ్లు 14 రకాల మోసాలను వినియోగిస్తున్నారని అమాయకులు ఆ మోసాలకు మాయమాటలకు భయపడి డబ్బును వారి ఎకౌంట్లకు ట్రాన్స్ఫర్ చేస్తున్నారని అన్నారు. సైబర్ నేరగాళ్లు పెట్టే భయానికి వినియోగదారుడు తమ పరువు పోతుందని బయటికి చెప్పేందుకు ఇష్టపడటం లేదని బ్యాంకు అధికారులు ఎక్కువ మొత్తంలో డ్రా చేస్తున్న వారిని ప్రశ్నించి వారు తగిన సమాధానం ఇవ్వకపోయినా లేదాఅనుమానం వస్తే తమకు సమాచారం ఇవ్వాలని సిఐ వెంకటేశ్వర్లు కోరారు. సైబర్ నేరగాళ్లు మీ పేరు న పార్సిల్ వచ్చిందని దానిలో డ్రగ్స్ ఉన్నాయని, అలానే అసభ్యకరమైన సందేశాలు వీడియోలు ఉన్నాయంటూ తదితర మోసాలతో బెదిరించి డబ్బులను డ్రా చేస్తున్నారని వివరించారు. సైబర్ నేరగాళ్లు తమ ఎకౌంట్లోకి వేసుకున్న డబ్బులను తిరిగి స్వాధీనం చేసుకోవటం ఆలస్యమైన కొద్దీ కష్టతరంగా మారుతోందని నేరం జరగకుండానే నియంత్రించాల్సిన బాధ్యత అందరి పైన ఉందని సిఐ వెంకటేశ్వర్లు అన్నారు. సైబర్ నేరాల నియంత్రణలో మన కుటుంబ సభ్యులకే ఇబ్బంది కలిగిందన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరు కృషి చేద్దామని బ్యాంక్ అధికారులను కోరారు. సైబర్ నేరాల నియంత్రణలో బ్యాంకు సిబ్బంది సహకారం ఉంటే సైబర్ నేరాలను నియంత్రించవచ్చునని బ్యాంకు నుంచి ఎక్కువ మొత్తంలో డబ్బు డ్రా చేసే వారి పట్ల బ్యాంకు సిబ్బంది అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాల నియంత్రణ సాధ్యమేననిసిఐ వెంకటేశ్వర్లు బ్యాంకు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ఎస్సై జి రాజు, చిల్లకల్లు ఎస్ఐ సూర్య శ్రీనివాస్, జగ్గయ్యపేట పరిసర ప్రాంతాలలోని బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## పోషణ్ పఖ్వాడా 2025 కార్యక్రమం



మైలవరం ఏప్రిల్ 21 మనం న్యూస్:మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ వారి ఆదేశాల మేరకు లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎస్.ఎస్.యూనిట్ వారి ఆధ్వర్యంలో పోషణ్ పఖ్వాడా 2025 అనే కార్యక్రమాన్ని స్థానిక యమ్.పి.పి.యస్ స్కూల్ లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల డీన్ ఆర్ %డ% డి యస్. పిచ్చి రెడ్డి మాట్లాడుతూ పోషణ్ అభియాన్ మార్చి 8, 2018న రాజస్థాన్లోని జుంఝునులో ప్రారంభించబడింది. ఈ పోషణ్ అభియాన్ అనేది యుక్తవయస్సులో ఉన్న బాలికలు, గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లుల కోసం 0 - 6 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లల పోషకాహార స్థాయిలను మెరుగుపరచడానికి ఉద్దేశించిన జాతీయ కార్యక్రమం అని అయన అన్నారు. యన్.యస్.యస్ ప్రోగ్రాం అధికారి బి.శివ హరి ప్రసాద్ మాట్లాడుతూ పోషన్ పఖ్వాడా యొక్క 7వ ఎడిషన్ 8 ఏప్రిల్ 2025 నుండి 23 ఏప్రిల్ 2025 వరకు నిర్వహించబడుతుంది. పోషణ్ అభియాన్ పిల్లలు మరియు స్త్రీలలో ఆరోగ్యకరమైన మరియు పోషకమైన ఆహారాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కథనంలో, మేము పోషన్ అభియాన్, దాని లక్షణాలు %డ% లక్ష్యాలు మరియు దాని 7వ ఎడిషన్ పోషన్ పఖ్వాడా గురించి వివరంగా విశ్లేషించారు. ఈ ప్రోగ్రామ్ సాంకేతికత, విభాగాల్లో జట్టు కృషిని మరియు పిల్లలలో కుంగిపోవడం, పోషకాహార లోపం, రక్తహీనత మరియు తక్కువ బరువుతో పుట్టడం వంటి సమస్యలను తగ్గించడానికి సమాజ ప్రమేయాన్ని ఉపయోగిస్తుంది. అనంతరం కళాశాల యన్.ఎస్.ఎస్. వాలంటీర్లు స్కూల్ పిల్లలకు బిస్కెట్స్ పంపిణి చేసారు . ఈ కార్యక్రమంలో డీన్ ఆర్ %డ% డి యస్. పిచ్చి రెడ్డి యన్.ఎస్.ఎస్.యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.శివహరి ప్రసాద్, యమ్.పి.పి.యస్ స్కూల్ హెచ్.యమ్. సుప్రియ కుమారి మరియు స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు, కళాశాల యన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

## వూటుకూరి కి చిరు సత్కారం



అమలాపురం ఏప్రిల్ 21 మనం ప్రతినిధి మండపేట శ్రీ అన్నపూర్ణమ్మ నిత్యాన్నదాన సేవా ట్రస్ట్ దేవాంగ పెద్దలు సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ని ఆయన ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి చిరుసత్కారం చేసి ఆత్మీయంగా పలకరించుకున్నారు ఈ కార్యక్రమం లో మండపేట ట్రస్ట్ అధ్యక్షులు కాశిన వెంకటేశ్వరరావు కాశిన కాశీవిశ్వనాధం 6 వార్డ్ కౌన్సిలర్ మండపేట పురపాలక సంఘం బనిశెట్టి సత్యనారాయణ , పిల్లే సత్యనారాయణ, దొంతంశెట్టి సూర్యవరప్రసాద్ అన్నపూర్ణాదేవి ఆలయ అర్చకులు, శ్రీ వెదుళ్ల గణపతి చేనేత సహకార సంఘం (మండపేట) బండారులంక ఉమారామ చౌడేశ్వరి ట్రస్ట్ ఉపాధ్యక్షులు వూటుకూరి వీరబ్రహ్మం బాబీ తదితరులు పాల్గొన్నారు

## జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థులకు బహుమతులు.



తాడేపల్లిగూడెం,ఏప్రిల్21,మనం న్యూస్ తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డ్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులను నేటి పోటీ ప్రపంచానికి తగినట్లుగా దీటుగా నిలబడేలా వారిలోని తెలివిని మేధస్సును పెంచి లక్ష్యసాధనలో ముందుకు నడిపించే విధంగా వారి ప్రతిభకు తగ్గట్టుగా నిర్వహించే -2 టాలెంట్ టెస్ట్ లో నేషనల్ స్థాయిలో తాడేపల్లిగూడెం బ్రాంచ్ చిన్నారులు చంద్రశేఖర్ 6వ తరగతి విద్యార్థి, ఐ. వాగ్దేవిక 4వ తరగతి విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచి ట్యాబ్ లను గెలుచుకున్నారు . వారికి నీట్ కాలేజీలో గౌరవనీయులైన డాక్టర్ వి సందీప్ ( డీన్, ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ )చేతుల మీదుగా బహుమతి ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏజీఎం పార్థసారథి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్, కోఆర్డినేటర్ రామారావు,డి మూర్తి,సి ఇన్చార్జ్ రాము, ప్రైమరీ ఇంచార్జ్ రజినీ, ఏవో గంగరాజు పాల్గొన్నారు.

## జోనల్ స్పోర్ట్స్ మీట్ లో తాపేశ్వరం శ్రీ చైతన్య విద్యార్థులు విజయకేతనం.



తాపేశ్వరం,ఏప్రిల్21,మనం న్యూస్రాజమండ్రి డివిజన్ లో జోనల్ లెవెల్ లో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ లో స్థానిక తాపేశ్వరం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచి వివిధ విభాగాలలో ప్రథమ మరియు ద్వితీయ స్థానాలు తో పాటు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారని స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మి నారాయణ తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ మొత్తం 15 బ్రాంచీలు నుండి వచ్చిన విద్యార్థులు రాజమండ్రి మోరంపూడి శ్రీ చైతన్య స్కూల్ లో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ లో పాల్గొన్నారని అందులో తాపేశ్వరం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు రన్నింగ్ రేస్, త్రో బాల్ మరియు షటిల్ లో ప్రథమ బహుమతి మరియు మ్యాచ్ ద రిలే గేమ్ లో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. తమ పాఠశాలలో చదువుతో పాటుగా క్రీడలకు ప్రతీ వారం శిక్షణ ఇవ్వడం వలన తమ విద్యార్థులు ముందంజలో ఉంటున్నారని రీజనల్ ఇన్చార్జి నరేష్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన రాజమండ్రి సిటీ ఎం ఎల్ ఎ ఆదిరెడ్డి వాసు మరియు ఫైర్ ఆఫీసర్ ఇంకు స్వామి బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను మరియు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు...

## గ్రేడ్-1 కార్యదర్శి సాయిరాం మృతి

### విస్మయ్యంలో పలువురు నాయకులు, అధికారులు.



రావులపాలెం ఏప్రిల్ 21 మనం న్యూస్. మండలంలోని గోపాలపురం గ్రామ పంచాయతీ లో గ్రేడ్-1 కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న నిమ్మకాయల సాయిరాం సోమవారం అనారోగ్యంతో రాజమండ్రి ప్రవేట్ హాస్పిటల్ లో తుదిశ్వాస విడిచారు. ఈయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ కార్యదర్శుల సంఘానికి అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి గా ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనందరావు, జనసేన పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, వైస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే, జిల్లా ఇంచార్జ్ జగ్గిరెడ్డి, ఆకుల రామకృష్ణ, చిలువూరి సతీష్ రాజు, కె వి సత్యనారాయణ రెడ్డి, మండలంలోని కార్యదర్శులు రావులపాలెం దుర్గాప్రసాద్, వెదిరేశ్వరం కార్యదర్శి డి. రాజు, ఈతకోట కార్యదర్శి శర్మ, దేవరపల్లి కార్యదర్శి ఎమ్. శ్రీనివాస్, యూనియన్ నాయకులు అయన మృతి కి సంతాపం తెలిపారు.